# గౌతమీగాథలు

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

## కొత్త ఊపిరి అందుకుంది

ఉవ్వెత్తుగా ఎగిరివచ్చే కొత్త ఊపిర్లను అందుకోవడం ఒక్క గోదావరి తల్లికే చేతనవును గాబోలు!

బరంపురం గాలి విసరింది.
చట్టున గోదావరి అందుకుంది.
విజయనగరం నుంచి వీచింది గాలి.
గౌతమీ హస్తాలు కౌగలించాయి!
తీగ తీస్తే డొంక కదులుతుంది.

ఆదిని పశ్చిమ చాళుక్య వాహిని ముంచెత్తితే ఉరకల్ని పరుగుల్ని ఒక పక్కకు నెట్టి మేలిమిని చేపట్టి తొలి తెలుగు కవితను దోసిళ్ళతో అందించింది.

గుండ్లకమ్మ నుంచి వచ్చిన ఘుమఘుమారభటిని లాలించి పాలించి కవితా శ్రీతో నాథవంతం చేసింది- నా గడ్డను గోదావరి!

ఒక్క మాటలో చెప్పాలంటే నా తల్లి నిజంగా పాతకొత్తల కొత్తపాతల మేలి కలయిక.

'చిత్రాంగి మేడ' ముందు భాగంలో ఏమిటా సభ? ఏమి కోలాహలం! పెదవుల చప్పుడు లేని నవ్వు దొంతరలు! గుండెల నిండా పైకి వినపడని మౌన సంగీతం.

నడవడం ఎరగని పరుగులు—
మాటలు మానిన పాటలు —

సాహితీసమితి చప్పబడింది; చింత చచ్చినా పులుపు చావలేదు. చేవ కూడగట్టి నన్నే చూడమన్నట్టు నిలబడింది. అది ఓం ప్రథమంగా బరంపురంలో ప్రాణ వాయువును చేదుకుంది. కొత్తపాత్రలో పాతపానీయం! సాహితీసమితి సరుకుతో, అభినవాంధ్ర కవి పండిత సభ, అవతరించింది. పంచాగ్నుల, చిలుకూరి, మున్నగు హేమాహేమీలు నిలబడి కొమ్ము కాచారు. గురుభాగవతుల ధర్మారావుగారు సహస్రాక్షుడై సభా విజయానికి తోడ్పడ్డారు. శివశంకరాదులు సరేసరి.

పేపర్లో రిపోర్టు చదివితే ప్రాణం లేచివచ్చింది మాకు. ఇప్పుడు షష్టిపూర్తికి పైబడిన వారంతా అప్పటికి "పాపం పసివాళ్ళు."

ఆ అభినవాంధ్ర కవి పండిత సభ రెండవ సమావేశం అదిగో అక్కడ జరుగుతోంది.

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు ప్రొఫెసరు శ్రీ రాయప్రోలు అధ్యక్షులు. రాయప్రోలు ఒంటికీ, పంటికీ ఇంకా బింకం తగ్గలేదు. శివశంకరుల హుషారు. వేదుల కొంటెతనం కృష్ణశాస్త్రి నిగనిగ మాయని రోజులు.

రాయప్రోలు అధ్యక్షోపన్యాసం శారద రామాయణం పాడినట్టుంది. కాని రాయప్రోలు గురుస్థానం చెక్కు చెదరకుండా ఉండడంవల్ల అది వేద పారాయణంలా చెల్లింది.

వేదుల వంతు తర్వాత. వేదుల కొంటెతనం అంతా మూతిలో బిగించి- "వచనాన్నే పాట పాడే ఈ సభలో పద్యం ఎలా చదవాలో తెలియడం లేదు. కాని — ఏముంది? తెలియడానికి తిరగేస్తే సరిపోతుంది" అంటూ కొత్తగా రాసుగొచ్చిన 'కాంక్ష', 'ఆషాఢమేఘం' చదివాడు. అచ్చంగా సంస్కృతం చదువుకున్నవాడు కూర్పుకొత్తదనంలో ఎంత మెరగగలడో ఆ పద్యాలు చెప్పాయి!

తర్వాత నావంతు 'భీష్మ ద్రోణ కృపాది ధన్వి నికరాభీలంబు' అన్నట్టు భయపడుతూ 'గురజాడ వాల్మీకి' అన్న వ్యాసం చదివాను. అప్పుడే భావ కవిత్వ 'మతం' పుచ్చుకున్నట్టు జమకట్టారు. వీడు మావాడు అన్నట్టు శివశంకరుల చేతివూపు. ఎందరో పద్యాలు చదివారు. మాటాడారు. అంతా గరం గరం. నవం నవం. అంతా ముందుకే- గమ్యం మాత్రం ఆ దేవుడికే తెలియాలి. ఆ సభలో యిద్దరు స్త్రీలు పాల్గొనడం విశేషం. ఒకరు వూటుకూరి లక్ష్మీకాంతమ్మగారు. రెండు పులవర్తి కమలాదేవిగారు. ఇంకో విశేషం ఏమంటే భావ కవితా మదన మోహనుడు కృష్ణశాస్త్రి పెదవి విప్పకపోవడం. ఆ వుద్యోగ పర్వంలో కృష్ణ - రాయబారం నిషిద్ధం.

మధ్యాహ్నం కవికొండల వారి కావ్య పఠనం. అసలే పీల మనిషి. తస్సా లెరగని సాత్త్వికుడు. 'నా మంచి పాట నాలో నేనే పాడుకుంటాను' అని మొదలెడితే 'పైకి పాడొద్దని గోల. మాట వరస కంటె అక్షరాల పట్టుకున్నారు. ఆయన పాడదలచుకున్నది పాడకుండా దిగలేదు. 'ఆడంబరం లేని గొప్ప కవిని ఆదరించడం చేతకానిది తెలుగు జాతి' అని రుజువు చేసుకున్నారు.

సభ ముగిసింది.

గౌతమీ లైబ్రరీలో 'గురజాడ జయంతి' అన్నారు. ఆశ్చర్యపడ్డాం.

విజయనగరంలో చదువుకునే రోజుల్లో 'గురజాడ'ను ఎవ్వరూ గొప్పకవిగా చెప్పుకోలేదు. వట్టి కన్యాశుల్కం నాటక కర్త. అదైనా నాటకంగా అంగీకరించిన వారు కొద్దిమంది. అది ఒక 'ఫార్సు' అని చాలా మంది అభిప్రాయం. అంతవరకూ ఆయనకు వర్ధంతులుగాని, జయంతులుగాని విజయనగరంలో తలపెట్టినవారు లేరు.

ఆ గౌరవం గౌతమీతీరానికి దక్కింది.

చింతా దీక్షితులుగారు అధ్యక్షులు. అసలే మితభాషి. మనిషి ఆరడుగులైతే మాటలు ఐదే. అన్నట్టు అయిదు పేజీల అధ్యక్షోపన్యాసం. కాగితాలమీద పరచిన ఆ ముత్యాల్లో ఒక్క పొల్లు లేదు.

గురజాడను "గురుజాడ"గా ఆరాధించేవారు మొదట దీక్షితులుగారు, తర్వాత భమిడిపాటి వారూను.

గురజాడ కవితలో జానపద రీతిని అనుసరించి ఇదీ తెలుగు జీవం అని పరశ్శతంగా పాటలు వ్రాశారు దీక్షితులు. ఆయన హాస్యపు ఒడుపును పట్టుగొమ్మగా చేసుకున్న భమిడిపాటి వారు గురజాడను తలపెట్టని గడియ ఉండేదికాదు.

ఆ రోజు ప్రధానవక్త శ్రీపాద కామేశ్వరరావుగారు. మూడు గంటలు పరవశంగా కన్యాశుల్కం గురించి మాటాడితే ఆ మూడు గంటలూ మాటల్లో అమోఘమైన నాటకం చూశాం. మధురవాణిని తనివితీరా చూద్దామని మేమనుకుంటే- కరటకుడూ అగ్నిహోత్రుడూ మా వెంట పడ్డారు. తుదిని శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రి గారి కథతో సభలో పువ్వులు చల్లినట్లయింది. సభలో ఉంచిన గురజాడ బొమ్మ మీసాల చాటునుంచి ముసిముసి నవ్వులు నవ్వుకుంది.